క్లుప్తంగా

రోడ్డు మూసివేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రెండో రైల్వే గేటు వద్ద కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా 45 రోజుల పాటు రోడ్డును మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుమతితో రోడ్డును మూసి వేస్తున్నట్లు చెప్పారు. ఆర్మూర్ పట్టణం నుంచి జక్రాన్‌పల్లి మండలం, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నయంగా గోవింద్‌పేట్ మార్గంలో గల బైపాస్‌పై నుంచి ప్రయాణం సాగించాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నియామకంలో ఎస్ఎంసీ తీర్మానం లేకుండా హెచ్ఎం కృష్ణ ఇతరులకు అప్పజెప్పినట్లు ఫిర్యాదు రావడంతో సందర్శించినట్లు తెలిపారు. ఏజెన్సీ మార్పుపై ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ఎంఈవో రాజేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సయ్య, బీఆర్ఎస్ నేత కమలాకర్ పాల్గొన్నారు.

'పల్లెలకు పోదాం' వర్క్‌షాప్

బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్‌లో పల్లెలకు పోదాం అభియాన్ వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్, వడ్డి మోహన్ రెడ్డిలు మాట్లాడారు. పల్లెకు పోదాం అభియాన్ వర్క్‌షాప్‌పై నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పల్లెలకు పోదాం అభియాన్ కన్వీనర్ స్వామి యాదవ్, మండల అధ్యక్షుడు మనోహర్, ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు లచ్చప్ప, పోశెట్టి, బూత్ అధ్యక్షులు తదితరులున్నారు.

వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగించాలి

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్ పర్సన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నుకు బాధ్యతలు అప్పగించాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చేపట్టిన ధర్నా శుక్రవారం సైతం కొనసాగించారు. ముస్లిం కమిటీ పెద్దలు దీక్షలో ఉన్నవారికి పూల దండలు వేసి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ముస్లిం మైనారిటీ మాట్లాడుతూ.. అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పటికీ ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక విషయంలో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తహసీల్ కార్యాలయ సందర్శన

వేల్పూర్: వేల్పూర్ తహసీల్ కార్యాలయాన్ని ఆర్మూర్ ఆర్డీవో రవికుమార్ శుక్రవారం సందర్శించారు. మండలంలోని లక్కోర, పడగల్, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల మీదుగా చేపట్టిన 63 నంబరు జాతీయ రహదారి విస్తరణ సర్వేను ఆయన పరిశీలించారు. ఏయే గ్రామాల సర్వే నంబర్ల భూముల నుంచి రహదారి విస్తరణ జరుగుతుంది.. ఎంత విస్తీర్ణంలో భూములు రహదారికి అవసరమవుతున్నాయి అని తెలుసుకున్నారు. మండలంలో రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ నాగార్జునతో చర్చించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

రుద్రూర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆరోగ్య సిబ్బందితో కల్సి సందర్శించారు. విద్యార్థులకు కుష్టు వ్యాధి గురించి అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చికిత్స అందరికి తెలిసి ఉండాలన్నారు. ఈ నెల 12న విద్యార్థులు అందరు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సవితా రాణి, సూపర్ వైజర్ జ్యోతి, సంగీత, ఆరోగ్య కార్యకర్తలు శ్రీదేవి, అనుపమ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రెంజల్(బోధన్): రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మాలతి అనే విద్యార్థిని ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, పీడీ ప్రవీణ్ కుమార్‌లు తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 76 కేజీల విభాగంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మాలతి మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం నుంచి రెండు రోజుల పాటు కరీంనగర్‌లో నిర్వహిస్తున్నారు.

కరాటేలో ప్రతిభ



బోధన్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రెండో అంతర్జాతీయ కరాటే పోటీలలో సాలూర మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాల 6వ తరగతికి విద్యార్థి ఎం.జశ్వంత్ గౌడ్, 4వ తరగతి విద్యార్థిని ఎం. భవ్యశ్రీ ప్రతిభ చాటారు. ఇద్దరు విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఇందిర, మల్లేశ్, కరాటే మాస్టర్లు ఖయ్యూం, పల్లవి అభినందించారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- కనీస సౌకర్యాలు కరువు
- పిచ్చి మొక్కలు పెరిగి అడవిలా తయారైన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



15వ వార్డులో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం..



క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో క్రీడలకు గత ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నేడు నిరుపయోగంగా మారాయి. ఆర్మూర్ పట్టణంలోని 36 వార్డులలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేద్దామని తొలుత భావించారు. కానీ 8 చోట్ల మాత్రమే క్రీడా ప్రాంగణాల కోసం స్థలాలు లభ్యమయ్యాయి. కేవలం నాలుగు చోట్లనే తెలంగాణ గ్రామీణ ప్రాంగణాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ ప్రాంగణాలను మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. క్రీడా ప్రాంగణాలలో ఆట వస్తువులు, పరికరాలు లేకపోడంతో మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి అడవిలా తయారైంది. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నిస్, తదితర క్రీడలకు కోర్టును ఏర్పాటు చేయాల్సి ఉండగా..అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. పట్టణంలోని 15వ వార్డులో, హౌసింగ్‌బోర్డు పార్కులో, బాలుర పాఠశాలలో క్రీడ ప్రాంగణాలు అని బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. వాటిని అభివృద్ధిలో తీసుకురావాలన్న ఆలోచన సైతం అధికారులు చేయడం లేదని పుర ప్రజలు వాపోతున్నారు. క్రీడ ప్రాంగణాలలో సౌకర్యాలు లేవు..శిక్షకులు లేరు. క్రీడా ప్రాంగణాల పేరుతో నిధులు మాత్రం దుర్వినియోగం అయ్యాయి. ఇప్పటికైన అధికారులు క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి వచ్చే విధంగా చూడాలని పుర ప్రజలు కోరుతున్నారు.

పిచ్చిమొక్కలను తొలగిస్తాం

15వ వార్డులోని తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తాం. క్రీడాకారులు ఆటలు ఆడుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటాం.

– భూమేశ్వర్, ఇన్‌చార్జి కమిషనర్, ఆర్మూర్

'ప్రత్యేక' అధికారులకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

బాల్కొండ: పల్లెల్లో ప్రత్యేకాధికారులకు ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు సహకరించాలని ఎంపీపీ యామగంటి లావణ్య కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైందన్నారు. అధికారులకు సహకరించి గ్రామాల అభివృద్ధి చేపట్టాలన్నారు. రానున్న వేసవిలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా రైతుల అందరికి వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం తాజా మాజీ సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి లావణ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం



ఫిజియోథెరపి చేస్తున్న వైద్యులు రేణుక

ఆర్మూర్: తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీ శిక్షణ సేవల ప్రాధాన్యతను గుర్తించి, వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపి శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భవిత కేంద్రంలో ప్రతీ వారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నామన్నారు. ఫిజియోథెరపీ వైద్యురాలు రేణుక మాట్లాడుతూ.. వైద్యులు సూచించిన పద్ధతులను దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లలతో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం



భాస్కర్‌ను సన్మానిస్తున్న బీజేపీ కార్యకర్తలు

వర్ని(చందూర్): దేశ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం చందూర్ మండల కేంద్రంలో నియోజకవర్గంలోని బీజేపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాలన్నీ మోదీ నాయకత్వాన్ని కొనియాడుతున్నాయని, అగ్రరాజ్యాలన్నింటికీ దిక్సూచిగా మారారని కొనియాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీ నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలను కోరారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మక్కయ్య, బీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ నాగం సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి సంఘన్ని మహేష్, బీసీ మోర్చా మండల అధ్యక్షులు మాశెట్టి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



కమ్మర్‌పల్లి మండల పరిషత్‌లో సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కూనేపల్లిలో సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పదవీ కాలం ముగియడంతో జిల్లాలో పలు చోట్ల సర్పంచులతో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానించారు. గ్రామాలభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని అధికారులు కొనియాడారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. – సాక్షి నెట్‌వర్క్

సమాచారం..

నేడే జాకోరా చైర్మన్‌పై అవిశ్వాసం

వర్ని: జాకోరా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిపై నేడు (శనివారం) అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డిపై డైరెక్టర్లు అవిశ్వాసం నోటీసును గత నెల 9న కమిషనర్‌కు అందజేయగా అవిశ్వాసంపై ఓటింగ్‌ను శనివారం సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నారు. సంఘంలో 13 మంది సభ్యులు ఉండగా 9 మంది అవిశ్వాసంపై సంతకాలు చేశారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన సంఘ సభ్యులు నెల రోజులుగా క్యాంపులో ఉన్నారు.

హన్మాన్ చాలీసా సామూహిక పారాయణం

రుద్రూర్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి మందిరంలో శనివారం ఉదయం 8 గంటలకు సామూహిక హన్మాన్ చాలీసా, శ్రీ రామరక్ష స్తోత్రం సామూహిక పారాయణం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరేశం తెలిపారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడికతీత



కాలువలను శుభ్రం చేయిస్తున్న రైతులు

వర్ని: కాలువల్లో పూడిక పేరుకుపోయి సాగునీరు అందకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా శ్రమదానం చేసి పూడిక తీయించారు. శుక్రవారం నిజాంసాగర్ ప్రధాన డిస్ట్రిబ్యూటరీ కాలువల(32, 33, 35)లో సుమారు మూడు కిలోమీటర్ల మేర పేరుకు పోయిన చెత్తాచెదారం, మట్టి పూడికలను జేసీబీ సహాయంతో శుభ్రం చేశారు. కాలువలో పూడిక చేరి ఆయకట్టు కింద పంటలు, చెరువులకు సాగునీరు అందడం లేదని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించకపోవడంతో రైతులు ఏకమై పూడికతీత పనులను చేపట్టారు. రుద్రూర్ గ్రామ రైతులు కోడె సుభాష్, కర్క అశోక్, బొట్టె గజేందర్, కన్నె రవి, పార్వతీ ప్రవీణ్, సంతోష్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే దుకాణాలు సీజ్ చేస్తాం



తాళం వేస్తున్న మున్సిపల్ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ పరిధిలోని దుకాణ సముదాయాల వ్యాపారులు బకాయి పడ్డ ఆస్తి పన్నును తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో దుకాణాలను సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ హెచ్చరించారు. శుక్రవారం బల్దియా అధికారులు పన్ను బకాయిలు చెల్లించ లేదనే కారణంతో పట్టణంలోని అనీల్ టాకీస్ రోడ్డులో గల 11 దుకాణాలకు తాళం వేశారు. ఈ 11 దుకాణదారులు రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పన్ను చెల్లించి పురపాలక అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని విశ్వకర్మ భవనంలో శుక్రవారం పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీపాదోజీవార్ జనార్దన్‌చారి, ప్రధాన కార్యదర్శిగా త్రివేణి నాగరాజు చారి, కోశాధికారిగా మల్లేశ్వరం నారాయణ చారి, ఉపాధ్యక్షులుగా బొప్పాపురం హనుమాన్ చారీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా స్వర్ణ కార సంఘం అధ్యక్షుడు తంగెళ్లపల్లి శ్రీనివాసాచారీ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

– బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్

బోధన్: నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉద్యమించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేశ్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని తట్టికోట కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తాం .. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేసి పరిశ్రమల యాజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రతినిధి పడాల శంకర్, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రమా, లక్ష్మి, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న పాలకవర్గసభ్యులు

ఎడపల్లి (బోధన్): 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎరువుల గోదాం నిర్మాణానికి నిధులు కేటాయించాలని శుక్రవారం మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వర్ రావును జానకంపేట సొసైటీ పాలక వర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి నిధులు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, జానకంపేట్ సహకార సంఘ ప్రతినిధులు, చైర్మన్ మిద్దె నరేందర్, వైస్ చైర్మన్ దాసరి ఒడ్డెన్న, డైరెక్టర్లు ఉన్నారు.

పథకాలు ప్రతి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలదే



కార్యకర్తలతో జిల్లా కార్యదర్శి సంతోష్

మాక్లూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చూడాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలదేనని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ అన్నారు. శుక్రవారం మాదాపూర్ పార్టీ కార్యాలయంలో జరిగిన 'పల్లెకు పోదాం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు తమవంతుగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటి నుండే ప్రతి బీజేపీ కార్యకర్త ప్రణాళికబద్ధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. అర్హులైన వారందరికి దగ్గరుండి దరఖాస్తు చేయించాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సురేష్ నాయక్, కార్యక్రమ కన్వీనర్ రాజేందర్‌రెడ్డి, కో కన్వీనర్ రమేష్‌నాయక్, తదితరులున్నారు.

నిధుల మళ్లింపుపై నిలదీత



ఐకేపీ సిబ్బందిని నిలదీస్తున్న మహిళలు

రెంజల్(బోధన్): రెంజల్ వనిత గ్రామ సంఘంలో జరిగిన నిధుల మళ్లింపుపై వరలక్ష్మీ స్వయం సహాయక సంఘం మహిళలు ఐకేపీ సిబ్బందిని నిలదీశారు. వరలక్ష్మీ సంఘం నుంచి తమకు తెలిచకుండానే. రూ.లక్షా 3 వేలను ఇతర సంఘాలకు ఎందుకు మళ్లించారని ప్రశ్నించారు. 6 నెలల కిందట ఫిర్యాదు చేస్తే సీఏపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలినా ఎందుకు రికవరీ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే వరకు కార్యాలయం నుంచి బయటకు వెళ్లేది లేదని తీర్మానించి కూర్చున్నారు. చివరకు ఏపీఎం చిన్నయ్య, సీసీ భాస్కర్‌లు జోక్యం చేసుకుని రెండు రోజుల్లో సీఏ నవ్య ద్వారా గ్రామ సంఘంలో జమ చేయిస్తామని లిఖిత పూర్వకంగా రాయించడంతో మహిళలు ఆందోళన విరమించారు.

సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు



సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

వర్ని(మోస్రా): కార్మిక సంఘాలు ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ ఉద్యోగులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మోస్రా తహసీల్దార్ సాయిలుకు సమ్మె నోటీసు అందజేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులందరూ పాల్గొంటారని నోటీసులో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం మహిళా ఉద్యోగుల పట్ల మొండిగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, నేతలు కరుణాదేవి, మీనా, పుష్ప, సుమలత ఉన్నారు.

ఉపాధి హామీ ఆవిర్భావ దినోత్సవం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని సంబంధిత అధికారులు ఘనంగా నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న చోట కేక్ కట్ చేసి కూలీలకు పంపిణీ చేశారు. ఎంపీపీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు



హసాకొత్తూర్ జీపీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో ఆంధ్రయ్య



వేల్పూర్ జీపీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో కమలాకర్

జీపీల పదవీ కాలం ముగియడంతో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులను జీపీ కార్యాలయాలకు ఆహ్వానించి తాజా మాజీ పాలకవర్గ సభ్యులు సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్



మాక్లూర్ ప్రత్యేక అధికారిగా జె క్రాంతి



సిద్దాపూర్‌లో.. ఎంపీడీవో బాల గంగాధర్



బాల్కొండ ప్రత్యేకాధికారిని సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు



చిక్కడపల్లిలో ఎంపీవో సాయిలుకు..

పల్లె ప్రకృతి వనం పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన మండల పశు సంవర్థక శాఖాధికారి లక్ష్మం ప్రభాకర్ శుక్రవారం గ్రామంలో సమస్యల పరిష్కారానికి నడుం బిగించారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విరిగిపోయిన కిటికీని బాగు చేయించాలని, మరుగుదొడ్ల వద్ద నీటి సదుపాయం కల్పించాలని కార్యదర్శి హరీశ్‌ను ఆదేశించారు. అలాగే పల్లె ప్రకృతి వనంలో మొక్కలను కాపాడటానికి పైపులను ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంటుకు సూచించారు. జీపీ సిబ్బంది, ఎంపీటీసీ బాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హ్యాపీ ఎండింగ్ - 12.05, 6.20 బూట్‌కట్ బాలరాజు (తెలుగు) - 3.15 ధీర (తెలుగు) - 9.30
స్క్రీన్-2 –	హనుమాన్ (తెలుగు)-- 02.40, 6.00, 9.20
స్క్రీన్-3 –	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు- 10.35, 1.30, 4.25, 7.20, 10.15
స్క్రీన్-4 –	ధీర (తెలుగు) - 01.20 కిస్మత్ (తెలుగు) - 4.00 గేమ్ ఆన్ (తెలుగు) - 6.50